సాక్షి రంగారెడ్డి

గురువారం । 8 । ఆగస్టు । 2024



'మాల్'కు కావాలి..

వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న మాల్ మార్కెట్‌లో నిఘా వ్యవస్థ లోపించింది. 8లో ▸



రక్షణ రంగాల్లో రాణించాలి

విద్యార్థులు రక్షణ రంగాల్లో రాణించాలని ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ నందురావు పేర్కొన్నారు. 8లో ▸



సమస్యలపై పోరాటం

విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. 8లో ▸

111 జీఓ ఉన్నట్టా..లేనట్టా!

ఎత్తేస్తున్నామని ప్రకటించిన గత ప్రభుత్వం

- 111 స్థానంలో 69 జీఓ
- కొత్త సర్కారు కొలువుదీరి ఎనిమిది నెలలైనా స్పష్టత కరువు
- ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో యథేచ్ఛగా వెలుస్తున్న 'బడా'నిర్మాణాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



జలాశయాల సమీపంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలు

మొయినాబాద్: జంట జలాశయాల పరిరక్షణ కోసం అమల్లోకి తెచ్చిన జీఓ 111పై సందిగ్ధత నెలకొంది. గత ప్రభుత్వం ఈ జీఓను రద్దు చేస్తున్నట్లు రెండు సార్లు ప్రకటించింది. 111 జీఓ స్థానంలో 69 జీఓను తీసుకువచ్చింది. సాంకేతికంగా మాత్రం 111 జీఓనే అమల్లో ఉందని అధికారులు వెల్లడిస్తున్నారు. గత ప్రభుత్వం జీఓ రద్దు ప్రకటన వెలువడిన వెంటనే గ్రామాల్లో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు ఊపందుకున్నాయి. అధికారులు సైతం నోటీసులిచ్చి చేతులు దులుపుకొంటున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి ఎనిమిది నెలలైనా 111 జీఓపై స్పష్టత ఇవ్వడం లేదు.

జీఓ పరిధిలో 84 గ్రామాలు

హైదరాబాద్ మహానగరానికి తాగునీరు అందించేందుకు నిజాం కాలంలో నిర్మించిన హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్(గండిపేట) జంట జలాశయాల పరిరక్షణకోసం 1996లో అప్పటి ప్రభుత్వం 111 జీఓను అమల్లోకి తెచ్చింది. జలాశయాల పరివాహక ప్రాంతాల్లోని 84 గ్రామాలను జీఓ పరిధిలో చేర్చింది. ఈ జీఓ పరిధిలో సుమారు 1.32 లక్షల ఎకరాల భూమి విస్తరించి ఉంది. జీఓ పరిధిలోని ప్రాంతంలో కాలుష్య కారక పరిశ్రమలు, వెంచర్లు, లేఅవుట్లు, నిర్మాణాలు చేపట్ట వద్దనే నిబంధనలున్నాయి. దీంతో ఈ ప్రాంతంలోని భూములకు ధరలు పెరగడంలేదు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న స్థానిక రైతులు 111 జీఓకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. పలు రాజకీ పార్టీలు సైతం జీఓ ఎత్తివేస్తామంటూ హామీలు గుప్పించాయి.

రద్దు ప్రకటనకే పరిమితమా..?

2014, 2018 ఎన్నికల్లో 111 జీఓను ఎత్తేస్తామని అప్పటి సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 2022 ఏప్రిల్ 19న 111 జీఓను ఎత్తేస్తున్నట్లు అసెంబ్లీలో ప్రకటించారు. దాని స్థానంలో 69 జీఓ తీసుకొచ్చారు. కానీ విధివిధానాలు, నిబంధనలు ప్రకటించలేదు. ఆ తర్వాత 2023 మే 18న 111 జీఓను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. 84 గ్రామాల్లో ఆంక్షలన్నీ తొలిగి హెచ్ఎండీఏ నిబంధనలే వర్తిస్తాయని ప్రకటించింది. 84 గ్రామాల పరిధిలోని సుమారు 1.32 లక్షల ఎకరాల్లో కొత్తగా గ్రీన్ సిటీ నిర్మిస్తామనే అంశాన్ని ముందుకు తీసుకొచ్చింది. జీఓపై నడుస్తున్న ఓ కేసులో 111 జీఓ నిబంధనలే అమలులో ఉన్నాయని అప్పటి ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది.

బడా బాబుల మేడలు

111 జీఓ పరిధిలో పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. జలాశయాల పరివాహక ప్రాంతాలతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో సైతం నిర్మాణాలు చేపడుతున్నారు. గత ప్రభుత్వం జీఓను రద్దు చేసినట్లు ప్రకటించిన అనంతరం నిర్మాణాలు విపరీతంగా పెరిగాయి. జీఓ పరిధిలో బహుళ అంతస్తుల మేడలు సైతం యథేచ్ఛగా నిర్మిస్తున్నారు. ఇవన్నీ బడాబాబులవే కావడం విశేషం. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు సైతం నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారు. దీంతో ముడుపులు తీసుకుని చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

నోరు మెదపని ప్రభుత్వం

జీఓ 111పై కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంలేదు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా ఇప్పటి వరకు 111 జీఓ అంశంపై ఒక్క మాట మాట్లాడలేదు. గత ప్రభుత్వం ఈ ప్రాంతంలోని 1.32 లక్షల ఎకరాల్లో గ్రీన్ సిటీ నిర్మిస్తామని ప్రకటించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ముచ్చర్ల ప్రాంతంలో నయా నగరి (ఫోర్త్‌సిటీ) నిర్మిస్తామని ప్రకటించడంతో జీఓ 111 ప్రాంతాన్ని ఎలా అభివృద్ధి చేస్తుందనే విషయం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధిపై దృష్టి పెడుతుందా.?లేదా.? అనే అంశం తెరమీదికి వస్తోంది. నగరానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ప్రాంతంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి జీఓ 111 అంశాన్ని పరిష్కరించాలనేది స్థానికుల ఆకాంక్ష.

అభివృద్ధిని అడ్డుకోవద్దు



111 జీఓ కారణంగా ఈ ప్రాంతం అభివృద్ధిలో వెనుకబడింది. జీఓను గతంలోనే ప్రభుత్వం రద్దు చేసి 69 జీఓ తీసుకొచ్చింది. అధ్యయన కమిటీని సైతం వేసింది. ప్రస్తుత ప్రభుత్వం ఈ జీఓ అంశంపై ఏమి మాట్లాడటం లేదు. నిబంధనల పేరిట అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన సొంత నియోజవర్గానికి ఈ మార్గం మీదుగానే ప్రయాణిస్తారు. ఆయనకు ఈ ప్రాంతంపై అవగాహన ఉన్నందున ప్రత్యేక దృష్టి సారించాలి.

– కొంపల్లి అనంతరెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు

111 జీఓ నిబంధనలే

హిమాయత్‌సాగర్, ఉస్మాన్‌సాగర్ జలాశయాల ఎగువ ప్రాంతంలో 111 జీఓ నిబంధనలే అమలులో ఉన్నాయి. గతంలో ప్రభుత్వం 69 జీఓ తీసుకొచ్చినా దాని విధి విధానాలు ప్రకటించకపోవడంతో కోర్టు దాన్ని రద్దు చేసింది. ప్రస్తుతం 111 జీఓ నిబంధనల ప్రకారమే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నవారికి నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటున్నాం. త్వరలోనే స్పెషల్ డ్రైవ్ పెట్టి అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తాం.

– సతీష్‌రెడ్డి, డీఎల్‌పీఓ, చేవెళ్ల



రైతు రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి. చిత్రంలో మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

ఆంక్షల పేరిట 'రుణమాఫీ'కి తూట్లు

- కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి
- తారామతి పేటలో 'రైతు రచ్చబండ'

అబ్దుల్లాపూర్‌మెట్: ఆంక్షలతో రైతు రుణమాఫీ హామీ కి తూట్లు పొడిచిన రేవంత్‌రెడ్డి సర్కార్‌కు రైతులు తగిన సమయంలో బుద్ధి చెబుతారని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో రుణమాఫీ పొందని రైతుల నుంచి క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు స్వీకరించేందుకు రైతు రచ్చబండ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం మండల పరిధిలోని తారామతిపేట గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి శ్రీధర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రభుత్వం జీఓ నంబర్ 567 పేరుతో అనేక ఆంక్షలు విధించి 60శాతం మందిని రుణమాఫీకి దూరం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు అందరికీ రుణమాఫీ అయిందంటూ అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటన్నారు. రైతులంతా సంఘటితంగా గ్రామాలకు వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. మోసపోయిన రైతులకు భరోసా కల్పించేందుకు కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి చేతుల మీదుగా హెల్ప్‌లైన్ నంబర్‌ను ప్రారంభిస్తే ఇప్పటికే వేలాది మంది తమ వివరాలను నమోదు చేసుకున్నారన్నారు. మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. కేసీఆర్ చేతిలో మోస పోయిన రాష్ట్ర ప్రజలు రేవంత్‌రెడ్డిని నమ్మి ఓటేస్తే నట్టేటా ముంచాడన్నారు. రూ.2లక్షల వ్యవసాయ రుణ మాఫీ హామీ, రైతు భరోసా పథకాలు రైతులందరికీ అందే వరకు బీజేపీ పోరాడుతుందన్నారు. రంగారెడ్డి రూరల్ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో రైతు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి ప్రత్యక్ష కార్యాచరణ రూపొందిస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపయ్యగౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిపల్లి అంజయ్యయాదవ్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి అర్జున్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ నారాయణ యాదవ్, పొట్టి రాములు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రమాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యుడు మోహన్ రెడ్డి, మండల అధ్యక్షుడు విష్ణుగౌడ్, పాపయ్యగౌడ్, నాయకులు అంజయ్య, ధర్మారెడ్డి, శ్రవణ్ చారి, సురేశ్, సాయికిరణ్ గౌడ్, కొండల్ రెడ్డి, శ్రీలత, అరుణ్ చారి, సత్యనారాయణ గౌడ్, నాగరాజుల రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

జీఐఎస్ మ్యాపింగ్‌తో మెరుగైన పాలన

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

లాలాపేట: హైదరాబాద్ మహానగరాన్ని జీఐఎస్ (జియోగ్రాఫికల్ ఇన్ఫర్మేషన్ సిస్టం) మ్యాపింగ్ చేసి వచ్చే ఆరు నెలల్లో నగర ప్రజలకు మరింత మెరుగైన పాలన అందిస్తామని, అందుకు అనుగుణంగా పనులు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం తార్నాకలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డితో కలిసి స్థానిక పార్కులో మొక్కలు నాటారు. పాఠశాల విద్యార్థులు నిర్వహించిన అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆమ్రపాలి మాట్లాడుతూ డ్రోన్ ద్వారా హైదరాబాద్ నగరం మొత్తాన్ని ఫుట్‌ప్రింట్ తీసుకుని..దాని ద్వారా బిల్డింగ్‌లు, రోడ్లు, ఖాళీ స్థలాలు, చెరువులు, కుంటలను మ్యాప్ ద్వారా గుర్తిస్తామన్నారు. దీంతో వాటి అభివృద్ధి, పర్యవేక్షణ సులభమవుతుందన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీలత మాట్లాడుతూ పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలు జీహెచ్ఎంసీకి సహకరించాలని కోరారు.

న్యూస్‌రీల్

ధ్వజస్తంభ ఏర్పాటుకు రూ.1.11లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

నందిగామ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగోనిగూడ శివారులో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయంలో ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభానికి బుధవారం ఆయన రూ.1.11లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు తమ సంపాదనలో కొంత సేవాకార్యాలకు వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తుమ్మల జగన్ యాదవ్, ఆంజనేయులు, బాలరాజు, వెంకట్ రెడ్డి,సుధాకర్, యాదయ్య, శ్రీకాంత్, నరేశ్, వంశీ, సాయి తదితరులు పాల్గొన్నారు.

మేకగూడను సందర్శించిన బ్యాంకు మేనేజర్లు



మేకగూడలో యూపీ బ్యాంకు మేనేజర్ల బృందం

నందిగామ: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 35 మంది బ్యాంకు మేనేజర్ల బృందం బుధవారం మండల పరిధిలోని మేకగూడను సందర్శించింది. వీరు మహిళా సంఘాల పనితీరును పరిశీలిచేందుకు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా మహిళా, గ్రామ సంఘాలు, బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలు ఏవిధంగా వినియోగించుకుంటున్నారు. తిరిగి రుణాలు ఎలా చెల్లిస్తున్నారనే విషయాలను ఆ సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి పొందే తీరుపై ఆరతీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఎల్ఎం కో ఆర్డినేటర్ అభిషేక్, డీపీఎం స్వర్ణలత, ఏపీఎం యాదగిరి, సీసీలు, మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛదనం-పచ్చదనం' పరిశీలన



కుర్మల్‌గూడ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రతిమాసింగ్

బడంగ్‌పేట్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని బుధవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ పర్యవేక్షించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, నాదర్‌గుల్ ప్రాంతాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల్లో పాఠశాల విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు తెలుసుకున్నారు. నాదర్‌గుల్‌లో ఓపెన్ నాలా మీదుగా ప్రవహిస్తున్న డ్రైనేజీ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బడంగ్‌పేటలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలను సందర్శించి విద్యార్థుల వసతులపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో మేయర్ చిగురింత పారిజాత, డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్, డీఈఈ యాదయ్య, ఏఈఈలు వినీల్‌గౌడ్, బిక్కునాయక్, ఎంఈఓ కృష్ణ, కార్పొరేటర్లు, శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ ఎంటమాలజిస్ట్‌పై చర్యలు

సాక్షి,సిటీబ్యూరో: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు, పెట్రోల్, డీజిల్ నకిలీ బిల్లులతో డబ్బులు దండుకుంటున్నట్లు వీడియోలు వైరల్ కావడంతో పాటు పలు చానెళ్ల,పత్రికల్లో వార్తలు వెలువడిన నేపథ్యంలో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లిజోన్లకు సీనియర్ ఎంటమాలజిస్టుగా పనిచేస్తున్న సంధ్యను బాధ్యతల నుంచి తప్పించి ప్రధాన కార్యాలయానికి సరెండర్ చేశారు. దీంతోపాటు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశాలమేరకు అడిషనల్ కమిషనర్(హెల్త్) బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

నందిగామ: వర్షాలు, వాతావరణంలో మార్పులతో వచ్చే సీజనల్ వ్యాధులు సంక్రమించే అవకాశమున్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి సూచించారు. బుధవారం ఆయన నందిగామలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ సుమతికి చెప్పారు. బాలింతలకు అందుతున్న పౌష్టిక ఆహారం గురించి అంగన్‌వాడీ టీచర్లను అడిడి వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులు, కిశోర బాలికల బరువును ఎప్పటిప్పుడు పరిశీలించి వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుమతి, పంచాయతీ కార్యదర్శి మల్లికార్జున్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్ చంద్రకళ, ఏఎన్ఎంలు రజిత, స్వరూప, అంగన్‌వాడీ టీచర్లు వరలక్ష్మీ, కమల, సుజాత, ఆశ వర్కర్లు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనం-పచ్చదనం పరిశీలన

కేశంపేట: స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని పరిశీలించేందుకు జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి బుధవారం మండల పరిధిలోని కొండారెడ్డిపల్లిలో పర్యటించారు. గ్రామంలోని నర్సరీ, కంపోస్టు ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. వన మహోత్సవంలో పాల్గొని మొక్క నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారి శిరీష, ఏపీఓ అజీజ్, పంచాయతీ కార్యదర్శి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: మొక్క నాటుతున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి

- కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అనధికారిక లేఅవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్) ప్రక్రియ జాగ్రత్తగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో లేఅవుట్ రూల్స్ రెగ్యులరైజేషన్ -2020పై ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహిస్తే విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లే అవకాశముందని, ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి నివేదికల ఆధారంగా క్లియర్ చేయాలని సూచించారు. ప్రభుత్వ భూములు మొదలైన వాటిలో ప్లాట్లు / లేఅవుట్‌ల క్రమబద్ధీకరణ మార్గదర్శకాలపై మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమష్టిగా కార్యచరణ రూపొందించుకొని పని చేయాలన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న లేఅవుట్ల క్రమబద్ధీకరణ మున్సిపల్ కమిషనర్లకు, మున్సిపల్ పరిధిలోలేనివి జిల్లా కలెక్టర్ పరిధిలోకి వస్తాయన్నారు. ఎల్ఆర్ఎస్‌లో ప్లాట్ క్రమబద్ధీకరణకు మూడు స్థాయిల్లో పరిశీలనలు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, డీపీఓ సురేష్ మోహన్, ఆర్డీఓలు సూరజ్‌కుమార్, అనంతరెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిరాం, వేణుమాధవ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కాపాడండి

చెరువులు కబ్జాలకు గురికాకుండా చూడాలని ఇరిగేషన్ అధికారులను కలెక్టర్ శశాంక ఆదేశించారు. బుధవారం తన చాంబర్‌లో ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. ఎఫ్‌టీఎల్ గుర్తించాలని, ఆక్రమణలు జరగకుండా గట్టి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు తయారు చేయాలని చెప్పారు.

చేనేతకు పునర్వైభవం తెస్తాం

- ఆమనగల్లులో చేనేత సంఘం భవన నిర్మాణానికి నిధులు
- జాతీయ చేనేత దినోత్సవంలో ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ శశాంక



చేనేత కార్మికురాలు యాదమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి, కలెక్టర్ శశాంక

ఆమనగల్లు: ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో చేనేత రంగానికి రాష్ట్రంలో పునర్వైభవం తీసుకువస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బుధవారం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వెలకట్టలేని నైపుణ్యం, సృజనాత్మకతకు చేనేత అద్దం పడుతోందన్నారు. అద్భుతమైన చేనేత కళను ప్రపంచానికి అందించిన ఘతన నేత కార్మికులదే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవసాయ రంగంతో పాటుగా చేనేత రంగ అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నేత కార్మికులకు ఉపాధి కల్పించి వారి జీవన ప్రమాణాల పెంచేందుకు కృషి చేస్తోందన్నారు. వీరి పెట్టుబడులకు అవసరమైన రుణాలు ఇవ్వడంతో పాటుగా అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామన్నారు. పట్టణంలో నేత సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థుల ఇబ్బందులు దూరం చేస్తామన్నారు. అభివృద్ధి పనులకు పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరు సహకరించాలని కోరారు.

పాఠశాలల అభివృద్ధికి సహకరించండి

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు, దాతల సహకారం అవసరమని కలెక్టర్ శశాంక అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని ఆకుతోటపల్లి, కోనాపూర్ గ్రామాల్లో పర్యటించారు. ఆకుతోటపల్లి గ్రామంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం ఆయన కోనాపూర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. తరగతి గదులు, వంట గది, టాయిలెట్స్‌ను పరిశీలించారు. పాఠశాలలో 31 మంది మాత్రమే ఉండడంతో ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. టాయిలెట్స్‌కు సున్నం వేయించాలని ఆదేశించారు. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు తల్లిదండ్రులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా కోనాపూర్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, ఆస్పత్రి ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని ఉపాధ్యాయులు విన్నవించారు.

ప్రతీ సోమవారం చేనేత వస్త్రాలు: కలెక్టర్

చేనేత రంగం అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయని కలెక్టర్ శశాంక చెప్పారు. 1905 ఆగస్టు 7న జరిగిన స్వదేశీ ఉద్యమం ప్రారంభమైన రోజును జాతీయ చేనేత దినోత్సవంగా జరుపుకొంటున్నామని కలెక్టర్ చెప్పారు. అర్హులైన చేనేత కార్మికులకు రుణాలు, ఫించన్లు మంజూరు చేస్తామన్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రతీ సోమవారం ప్రభుత్వాధికారులు విధిగా చేనేత వస్త్రాలను ధరిస్తున్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు పున్న సత్యనారాయణ, పురుషోత్తం, చంద్రశేఖర్, వనం యాదమ్మలను ఎమ్మెల్యే, కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళిశాఖ ఏడీ ఇందిర, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్, డీపీఓ సురేశ్‌మోహన్, డీఈఓ సుశీందర్‌రావ్, మండల ప్రత్యేకాధికారి సుజాత, ఎంపీడీఓ కుసుమమాధురి, తహసీల్దార్ లలిత, ఎంఈఓ సర్దార్‌నాయక్, పద్మశాలీసంఘం నాయకులు బాలకృష్ణ, కేశవులు, శ్రీను, శివలింగం, ప్రసాద్, నాయకులు జగన్, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణ, విజయ్, మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.



ఆకుతోటపల్లిలో మొక్క నాటి నీరుపోస్తున్న కలెక్టర్ శశాంక

రక్షణ రంగాల్లో విద్యార్థినులు రాణించాలి

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు రక్షణ రంగాల్లో రాణించినప్పుడే దేశభక్తిపై మరింత విశ్వాసం పెరుగుతుందని ఎన్‌సీసీ రాష్ట్ర 7వ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కన్నల్ నందురావు పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని ఎస్‌టీఆర్ విద్యాసంస్థల్లో ఇంటర్, డిగ్రీ చదువుతున్న 68 మంది విద్యార్థినులు ఎన్‌సీసీ క్యాంపునకు ఎంపికయ్యారు. ఇంటర్ చదువుతున్న విద్యార్థునులు రెండేళ్లు, డిగ్రీ చదువుతున్న వారికి మూడేళ్ల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీసీ రాష్ట్ర 7వ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కన్నల్ నందురావు పాల్గొని విద్యార్థినుల పరేడ్‌ను పరిశీలించారు. విద్యార్థుల ఎంపిక అనంతరం ఆయన మాట్లాడుతూ.. రక్షణ రంగాల్లో విద్యార్థినులకు ఎంతో మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. రక్షణ, నైపుణ్యంతో పాటు మంచి విజ్ఞానాన్ని పెంపొందించుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఆర్ విద్యాసంస్థల డీన్ డాక్టర్ రామారావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.


గౌరవ వందనం స్వీకరిస్తున్న అధికారులు

ఎంఈఓలను నియమించాలి

ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలను పర్యవేక్షించే ఎంఈఓ పోస్టులను వెంటనే నియమించాలని ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ, ప్రధాన కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం జిల్లా ఉపాధ్యాయ సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్కారు బడులను పర్యవేక్షణ చేసేందుకు 20 ఏళ్లుగా పూర్తిస్థాయిలో మండల విద్యాధికారులు(ఎంఈఓ) లేక విద్యావ్యవస్థ కుంటుపడిందన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంఈఓలను నియమించాలన్నారు. అలాగే ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అంతకుముందు సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు బి.శ్రీనివాస్, ఎన్నికల అధికారి సమక్షంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా నర్సింహ, ప్రధాన కార్యదర్శిగా టి.సుధాకర్, కోశాధికారిగా ఎ.యాదిలాల్, ఉపాధ్యక్షుడిగా డి.ప్రభు, జాయింట్ కార్యదర్శిగా పి.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వీరన్న, మహిళ కార్యదర్శులుగా పి.సుజాత, ఎల్.నీరజ, ఎం.శైలజ, టి.సునీత, వై.సావిత్రి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా శ్రీను ఉన్నారు. కార్యక్రమంలో రమణకుమార్, చంద్రశేకర్, రమేశ్, నర్సింహారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సంఘం సభ్యులు

జ్యువెలరీ షాప్‌లో భారీ చోరీ

48 తులాల బంగారం, 80 కిలోల వెండి, రూ.1.5 లక్షల నగదు అపహరణ

శామీర్‌పేట్: జ్యువెలరీ షాపులో భారీ చోరీ జరిగిన సంఘటన శామీర్‌పేట్ పీఎస్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. తూంకుంట మున్సిపాలిటీ పరిధిలో అదే ప్రాంతానికి చెందిన గణేశ్ కృష్ణ జ్యువెలరీ షాప్ నిర్వహిస్తున్నాడు. మంగళవారం రాత్రి దుకాణానికి తాళం వేసి ఇంటికి వెళ్లాడు. తిరిగి బుధవారం ఉదయం వచ్చి చూడగా షెట్టర్ తెరిచి ఉన్నట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఆధారాలు సేకరించారు. తాళం పగులగొట్టి రాడ్ సాయంతో షెట్టర్‌ను పైకిలేపి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. 48 తులాల బంగారం, 80 కిలోల వెండి, రూ. 1.50 లక్షల నగదుతోపాటు సీసీ కెమెరాల ఫుటేజీని దుండగులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సంఘటనా స్థలాన్ని బాలానగర్ డీసీపీ సురేశ్‌కుమార్, మేడ్చల్ డీసీపీ నర్సింహారెడ్డి, పేట్‌బషీర్‌పేట్ ఏసీపీ రాములు, ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్ సందర్శించారు.

'విద్యారంగ సమస్యలపై పోరాటం'

షాద్‌నగర్: విద్యారంగ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని బీఏఎం కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయంబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో ఎదుర్కొంటున్న సమస్యలపై భారత విద్యార్థి ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తున్నామని అన్నారు. ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముకీద్, జుబేర్, సాయి, విజయ్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న శ్రీకాంత్

ఈఎంఐ చెల్లించలేక.. వ్యక్తి ఆత్మహత్య

ఘట్‌కేసర్: ఆర్థిక సమస్యల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నర్సింహ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మహబూబాబాద్ జిల్లా, కుర్వికి చెందిన మాలోతు వాసు(32) బోడుప్పల్‌లో ఉంటున్నాడు. గత కొంత కాలంగా ఆర్థిక సమస్యలు ఎదుర్కొంటున్నాడు. వాహనం ఈఎంఐ చెల్లించకపోవడంతో ఫైనాన్స్ ఏజెంట్ల వేధింపులు భరించలేక సోమవారం ఈసీఐఎల్–ఘట్‌కేసర్ అండర్‌పాస్ రోడ్డు వద్ద యాసిడ్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతడిని నిమ్స్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం పేరుతో మహిళకు టోకరా

బంజారాహిల్స్: పోలీసు ఆఫీసర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని ఓ మహిళను నమ్మించి రూ.లక్షల్లో డబ్బులు వసూలు చేసిన మోసగాడిపై బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–10లోని ఇబ్రహీంనగర్‌లో నివసించే రంగలక్ష్మి శ్రీనగర్‌కాలనీలోని హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీలో బుకింగ్ ఏజెంట్. గత జనవరిలో కిరణ్‌కుమార్ అనే కస్టమర్ బుకింగ్ కోసం ఆమె వద్దకు వచ్చి పోలీసు ఆఫీసర్‌నని, డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించాడు. దీంతో తన సోదరుడు గణేష్‌కు ఉద్యోగం ఇప్పించాలని ఆమె కోరింది. ఖర్చుల పేరిట కిరణ్‌కుమార్ ఆమె వద్ద నుంచి రూ.52 వేలు ఫోన్‌పే ద్వారా వసూలు చేశాడు. మరోసారి రూ.11.37 లక్షలను తన బ్యాంక్ ఖాతాకు మళ్లించుకున్నాడు. ఆరు నెల రోజులుగా అతడు స్పందించలేదు. ఈ మేరకు బాధితురాలు పీఎస్‌లో ఫిర్యాదు చేశారు.

'మాల్'కు పోలీస్ అడ్డా కావాలి

జనజీవనం సాఫీగా సాగడంలో శాంతిభద్రతల పరిరక్షణ అత్యంత కీలకమైన అంశం. ఇందులో పోలీసుల పాత్ర ప్రధానమైనది. వ్యాపార కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతాల్లో పోలీస్ స్టేషన్ల ఏర్పాటు తప్పనిసరి. ఇవి ఆపత్కాలంలో బాధితులకు బాసటగా నిలుస్తాయి.


రంగారెడ్డి-నల్గొండ జిల్లాల సరిహద్దులోని మాల్ చౌరస్తా

- వాణిజ్య కేంద్రంలో విజృంభిస్తున్న దొంగలు
- రెండు జిల్లాల సరిహద్దులో ఉండటంతో సులువుగా తప్పించుకుంటున్న వైనం
- స్థానికంగా పీఎస్ ఏర్పాటుకు స్థానికులు, వ్యాపారుల అభ్యర్థన

యాచారం: వ్యాపార కేంద్రంగా దినదినాభివృద్ధి చెందుతున్న మాల్ మార్కెట్‌లో నిఘా వ్యవస్థ లోపించింది. నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై రంగారెడ్డి, నల్గొండ జిల్లాల సరిహద్దులో ఈ మార్కెట్ ఉంది. నిత్యం వివిధ పనుల నిమిత్తం వేలాది మంది ఇక్కడికి వస్తుంటారు. వ్యాపార, వాణిజ్యపరంగా ఎంతో అభివృద్ధి చెందుతున్న మాల్ మార్కెట్లో సరైన రక్షణ లేకుండా పోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. రెండు జిల్లాల పరిధిలోని ప్రజాప్రతినిధులు ప్రజల రక్షణ కోసం మాల్ కేంద్రంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని స్థానికులు మొర పెట్టుకుంటున్నా ఫలితం లేకుండాపోతోంది.

యథేచ్ఛగా దొంగల సంచారం

మాల్ మార్కెట్‌లో చోరీకి పాల్పడుతున్న దొంగలు సులువుగా తప్పించుకుంటున్నారు. దీనికి కారణం ఫిర్యాదు చేసేందుకు స్థానికంగా పీఎస్ అందుబాటులో లేదు. అలాగే ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా రెండు జిల్లాల పరిధిలోని ఠాణాల కిందికి వస్తుంది. ఇది దుండగులకు కలిసి వస్తోంది. దొంగలు ఓ మండల పరిధిలో చోరీ చేసి మరో మండలంలోని జారుకుంటున్నారు. ఇటీవల మాల్ మార్కెట్ పరిధిలో సుమారు 20కి పైగా చోరీ కేసులు నమోదయ్యాయి. మాల్ మార్కెట్‌కు యాచారం ఠాణా 9 కిలోమీటర్లు, నల్గొండలోని మర్రిగూడ పీఎస్ 15 కిలోమీటర్లు, చింతపల్లి ఠాణా 20 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.

బ్లాక్ దందాకు అడ్డా

నిఘా లేకపోవడంతో బ్లాక్ మార్కెట్‌కు మాల్ మార్కెట్ అడ్డాగా మారింది. ఆయా మండలాల పోలీసులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. రేషన్ బియ్యం కొనుగోళ్లు, బెల్లం అమ్మకాలు, గ్యాస్ సిలిండర్ల బ్లాక్ మార్కెట్, నకిలీ వైద్యం, హోటల్లో మద్యం అమ్మకాలు, నాసిరకమైన భోజనం, నకిలీ విత్తనాలు, ఎరువులు ఇలా పలు వ్యాపారాల్లో అక్రమ దందా జోరుగా సాగుతోంది. ప్రతి మంగళవారం జరిగే పశువుల సంత జరుగుతుంది. ఆ రోజు అక్రమ దందాకు అడ్డూఅదుపు ఉండదు.

గతంలోనే అడుగులు

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మాల్ కేంద్రంలో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు అంకురార్పణ జరిగింది. అప్పట్లో హోంమంత్రిగా ఉన్న జానారెడ్డి సీఎంతో మాట్లాడి ప్రత్యేక ఠాణా నిర్మాణానికి స్థల ఎంపిక చేశారు. వైఎస్సార్ అకాల మృతితో పీఎస్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో స్థానికుల్లో మాల్‌లో ఠాణా ఏర్పాటుపై ఆశలు చిగురిస్తున్నాయి.

స్థానికుల ఇబ్బందులు



మాల్‌లో ఠాణా లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై వైఎస్సార్ హయాంలో అప్పటి హోంమంత్రి జానారెడ్డి దృష్టికి తీసుకెళ్లా. అనివార్య కారణాలతో అది ఆగిపోయింది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో జానారెడ్డి దృష్టికి తీసుకెళ్తా.

– రాంరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ, యాచారం

ఫిర్యాదులు చేయాలి



నల్గొండ పరిధిలో చోరీలు చేసి రంగారెడ్డి జిల్లాలో దొంగలు ప్రవేశిస్తే వెంటనే ఫిర్యాదు చేయాలి. మాల్ మార్కెట్‌లో జరిగిన కొన్ని సంఘటనలు నా దృష్టికి వచ్చాయి. బాధితులు చోరీలపై ఫిర్యాదులు చేస్తే దొంగలను పట్టుకొని కఠిన చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌కుమార్, సీఐ, యాచారం

నాంపల్లిలో దొంగనోట్ల కలకలం

- కిరాణా షాపు యజమాని ఫిర్యాదుతో కేసు నమోదు
- ఆగాపురకు చెందిన యువకుడిని నిందితుడిగా గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: నాంపల్లి ప్రాంతంలో దొంగనోట్ల మార్పిడిపై నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్) పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇందులో నిందితుడిగా ఉన్న ఆగాపుర వాసి సయ్యద్ యూసుఫ్ కోసం గాలింపు చేపట్టారు. నాంపల్లిలోని లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ జఫార్ స్థానికంగా కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. గత నెల 15న అతను దుకాణంలో ఉండగా అక్కడికి వచ్చిన ఓ యువకుడు రూ.70 విలువైన వస్తువులు ఖరీదు చేసి రూ.500 ఇచ్చాడు. ఇది నకిలీ నోటని గుర్తించని జఫార్ రూ.430 తిరిగి ఇవ్వడంతో అతను తీసుకుని వెళ్లిపోయాడు. గత నెల 31న మరోసారి జఫార్ దుకాణానికి వచ్చిన సదరు యువకుడు మరికొన్ని వస్తువులు ఖరీదు చేసి రూ.500 వచ్చి చిల్లర తీసుకువెళ్లాడు. మర్నాడు ఉదయం ఈ రెండు నోట్లతో సహా మరికొంత నగదు తీసుకువెళ్లిన జఫార్ స్థానికంగా ఉన్న మిల్క్ ఏజెన్సీలో చెల్లించే ప్రయత్నం చేశాడు. వాటిని నకిలీ నోట్లుగా గుర్తించిన ఏజెన్సీ నిర్వాహకులు జఫార్‌ను అప్రమత్తం చేశారు. ఈ నెల 1న మరోసారి తన దుకాణానికి వచ్చిన ఆ యువకుడిని గుర్తించిన జఫార్ అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించగా తప్పించుకుని పారిపోయాడు. స్థానికంగా ఆరా తీసిన జఫార్ అతడు ఆగాపురకు చెందిన సయ్యద్ యూసుఫ్‌గా తెలుసుకున్నాడు. దీంతో అదే రోజు నాంపల్లి ఠాణాలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ నకిలీ నోట్ల వెనుక భారీ నెట్‌వర్క్ ఉందని అనుమానించిన ఉన్నతాధికారులు కేసును దర్యాప్తు నిమిత్తం సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ ఫైల్ అందుకున్న సీసీఎస్ పోలీసులు బుధవారం రీ–రిజిస్టర్ చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చనిపోతూ.. ముగ్గురికి ప్రాణభిక్ష!

- బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి నుంచి అవయవాల సేకరణ
- అదే ఆస్పత్రిలో వేరే పేషెంట్‌కు కిడ్నీ అమర్చిన డాక్టర్లు
- సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రి డాక్టర్ల ఘనత

సాక్షి, సిటీబ్యూరో: ఈఎస్ఐ ఆస్పత్రి వైద్యులు అరుదైన ఘనత సాధించారు. బ్రెయిన్ డెడ్ అయిన ఓ వ్యక్తి నుంచి అవయవాలు సేకరించి.. అదే ఆస్పత్రిలోని మరో పేషెంట్‌కు అమర్చారు. 45 ఏళ్ల నర్సింగ్ అనే వ్యక్తికి బ్రెయిన్ డెడ్ కావడంతో డాక్టర్ సామ్సన్ ఆయన కుటుంబీకులకు అవయవదానంపై అవగాహన కల్పించారు. దీంతో వారు అవయవదానానికి ముందుకొచ్చారు. వెంటనే డాక్టర్ మధు, డాక్టర్ సందీప్‌తో కూడిన బృందం అతడి నుంచి రెండు కిడ్నీలు, కాలేయం సేకరించింది. అదే ఆస్పత్రిలో నాలుగేళ్లుగా డయాలసిస్ చికిత్స పొందుతున్న వ్యక్తికి కిడ్నీ మార్పిడి చేశారు. ఈ ట్రాన్స్‌ప్లాంట్ సర్జరీని నెఫ్రాలజీ విభాగానికి చెందిన డాక్టర్ సందీప్, డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ పాండురంగారావు బృందం నిర్వహించింది. ఒకే ఆస్పత్రిలోకి అవయవాలు తీసుకుని, అదే ఆస్పత్రిలోని మరోవ్యక్తికి అవయవం మార్పిడి చేయడం ఈఎస్ఐ ఆస్పత్రి చరిత్రలో ఇదే తొలిసారి కావడం గమనార్హం. మిగిలిన రెండు అవయవాలను ఉస్మానియా ఆస్పత్రిలో మరో ఇద్దరు పేషెంట్లకు ట్రాన్స్‌ప్లాంట్ చేశారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు


అక్షయ (ఫైల్)

షాబాద్: యువతి అదృశ్యమైన సంఘటన మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. షాబాద్ సీఐ కాంతారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మారుగల్ల మల్లేశ్ చిన్న కూతురు అక్షయ(18) మంగళవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి నిద్రించింది. మధ్యరాత్రి కుటుంబీకులు లేచి చూసే సరికి పడుకున్న చోట అక్షయ కనిపించ లేదు. దీంతో యువతి కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లిదండ్రులు బుధవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నానాజీపురం గ్రామానికి చెందిన సందీప్ అనే యువకుడిపై తమకు అనుమానం ఉందని ఆరోపించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుండెపోటుతో బిల్‌కలెక్టర్ మృతి


జంగయ్య (ఫైల్)

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న బిల్ కలెక్టర్ యంజాల జంగయ్య(55) బుధవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందారు. ఉదయం 8 గంటల వరకు చలాకీగా ఉన్న ఆయన అనంతరం ఒక్కసారిగా కుప్పకూలి ప్రాణాలు కోల్పోయారు. సమాచారం తెలుసుకున్న మున్సిపాలిటీ కమిషనర్ వాణిరెడ్డి, తోటి కార్మికులు ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం నగదును అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దఎత్తున తరలివచ్చి సంతాపం తెలిపి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని నింపారు. మృతుడికి ఇద్దరు కుమార్తెలతో పాటు ఒక కుమారుడు ఉన్నారు.


రూ.5 లక్షల విలువైన యూఎస్ డాలర్ల చోరీ

బంజారాహిల్స్: యజమాని కళ్లుగప్పి బ్యాగ్‌లో ఉన్న డాలర్లను తస్కరించిన డ్రైవర్ కోసం బంజారాహిల్స్ పోలీసులు గాలింపు చేపట్టారు. వివరాల్లోకి వెళితే... మధురానగర్‌కు చెందిన ధాత్రి వెంకట ప్రసన్నకుమార్ తన తల్లితో కలిసి గత నెల 9న బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12లోని ఓ ఫర్నిచర్ షోరూంకు వచ్చాడు. కారు వెనుక బ్యాగ్‌లో డాలర్లు, ఇతర పత్రాలను భద్రపరిచి వీరు ఫర్నిచర్ షాపులోకి వెళ్లారు. అదే నెల 13న బ్యాగ్‌లో చూసుకోగా అందులో ఉండాల్సిన డాలర్లు కనిపించలేదు. 5,900 డాలర్లు చోరీకి గురయ్యాయని, ఫర్నిచర్ షాపు ఎదుట ఉన్న సీసీ ఫుటేజీలు పరిశీలించగా తమ డ్రైవర్ మన్నం వీరనారాయణ అలియాస్ తేజ అనుమానాస్పద కదలికలు, కారు వెనుక బ్యాగ్ తెరిచిన దృశ్యాలు కనిపించాయని, ఆయనపైనే అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విహారానికి వెళ్లి చేతివాటం!

గోవాలో నగర వాసి సాయి కిరణ్ రెడ్డి చోరీలు

- పోలీసులకు చిక్కకూడదని అక్కడి నుంచి కేరళకు
- హైదరాబాద్ వచ్చే ప్రయత్నాల్లో ఉండగా పట్టివేత
- ఇతడిపై నగరంలో 31 కేసులు, 11 కేసుల్లో శిక్ష



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన అతడి పేరు సాయి కిరణ్ రెడ్డి... ఇక్కడి మూడు కమిషనరేట్ల పరిధిలో అనేక నేరాలు చేశాడు... కొన్నింటిలో శిక్ష కూడా పడింది... గత నెలలో విహారయాత్ర కు గోవా వెళ్లాడు... ఓ హోటల్‌లో బస చేసిన ఇతను పక్క గదిలో ఉన్న మధ్యప్రదేశ్ వ్యక్తి సొత్తు, సొమ్ము కాజేసి కేరళ పారిపోయాడు... కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన కలంగుట్ పోలీసులు నగరానికి తిరిగి వచ్చే ప్రయత్నాల్లో ఉండగా పట్టుకున్నారు. ప్రాథమిక విచారణలో ఇతడి నేర చరిత్ర బయటపడటంతో ఇక్కడి అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇంటర్ వరకు చదివిన కిరణ్ తల్లిదండ్రులు నిర్లక్ష్యం కారణంగా జులాయిగా మారాడు. పలు వ్యసనాలకు బానిసైన అతను అందుకు అవసరమైన డబ్బు కోసం చోరీలు చేయడం మొదలెట్టాడు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలోని వివిధ పోలీసుస్టేషన్ల పరిధిలో చోరీలు చేసి పలుమార్లు పోలీసులకు చిక్కాడు. ఇప్పటి వరకు దాదాపు 31 చోరీలకు పాల్పడిన ఇతను 11 కేసుల్లో జైలుకు వెళ్లివచ్చాడు. ఇటీవల విహారయాత్ర కోసం గోవా వెళ్లిన కిరణ్ కలంగుట్ ప్రాంతంలోని ఓ హోటల్‌లో బస చేశాడు. ఇతడి పక్కన ఉన్న గదిలో మధ్యప్రదేశ్ నుంచి వచ్చిన సత్యశీల్ శర్మ దిగారు. ఆయన సెల్ ఫోన్, బంగారు గొలుసు, నగదుపై కన్నేసిన కిరణ్... అదును కోసం ఎదురు చూశాడు. గత నెల 30న రాత్రి సత్యశీల్ బీచ్ నుంచి గదికి వచ్చి తలుపు లోపలి నుంచి గడియ పెట్టుకోకుండా స్నానానికి వెళ్లాడు. అదే అదునుగా భావించిన కిరణ్ అతడి గదిలోకి ప్రవేశించి ఫోన్, రూ.65 వేల నగదు, బంగారు గొలుసు తస్కరించాడు. తక్షణం తన గది ఖాళీ చేసి హోటల్ నుంచి బయటకు వచ్చేశాడు. ఇప్పటికే అనేకసార్లు అరెస్టు అయి ఉండటంతో కిరణ్‌కి పోలీసుల దర్యాప్తు విధానాలు తెలుసు. ఈ నేపథ్యంలోనే తాను నేరుగా హైదరాబాద్ వస్తే పోలీసులు గుర్తిస్తారని భావించిన అతను వారిని తప్పుదోవ పట్టించేందుకు గోవా నుంచి కేరళ వెళ్లాడు. సత్యశీల్ ఫిర్యాదు మేరకు కలంగుట్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. దీన్ని దర్యాప్తు చేయడానికి ఇన్‌స్పెక్టర్ పరేజ్ జి.నాయక్ ఐదుగురు పోలీసులతో బృందాన్ని ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల్లో నమోదైన ఫుటేజ్‌తో పాటు సాంకేతిక ఆధారాలను బట్టి కిరణ్ కేరళ వెళ్లినట్లు గుర్తించారు. అక్కడకు వెళ్లిన కలంగుట్ పోలీసులు శనివారం రాత్రి హైదరాబాద్ వెళ్లే ప్రయత్నాల్లో భాగంగా కన్నూర్ రైల్వేస్టేషన్‌కు చేరుకున్న కిరణ్‌ను అరెస్టు చేశారు. ఇతడి నుంచి రూ.10 వేల నగదు, బంగారు గొలుసు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని గోవా తరలించిన అధికారులు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపారు. ప్రాథమిక విచారణ నేపథ్యంలో తన నేరచరిత్రతో పాటు హైదరాబాద్‌లో మరికొన్ని నేరాలు చేసినట్లు కిరణ్ బయటపెట్టాడు. దీనిపై గోవా అధికారులు నగర పోలీసులకు సమాచారం అందించారు. కలంగుట్ అధికారుల కస్టడీ పూర్తయిన తర్వాత కిరణ్‌ను పీటీ వారెంట్‌పై ఇక్కడికి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు.